క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు టౌన్: తాండూరు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పట్టణ విద్యుత్ ఏఈ రాఘవేందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గౌతాపూర్ రోడ్డు మార్గంలోని విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా నేటి ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇందిరాచౌక్ నుంచి శివాజీచౌక్ వరకు, సీసీఐ కాలనీ, హమాలీ బస్తీ పరిధిలో విద్యుత్ కోత ఉంటుందన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఉత్తములకు' ఎనలేని గౌరవం



హెడ్‌కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్సై, సిబ్బంది

కుల్కచర్ల: ఉత్తమ ఉద్యోగులు ఎక్కడికెళ్లినా గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఎస్సై గిరి అన్నారు. కుల్కచర్ల ఠాణాలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జైపాల్ రెడ్డి.. బదిలీపై బొంరాస్‌పేట్‌కు బదిలీ కాగా శనివారం ఆయన్ను సన్మానించారు. అనంతరం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించే ఉద్యోగులను వారు.. ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ సేవలు అందించడమే పోలీసు ఉద్యోగి ప్రథమ కర్తవ్యమని చెప్పారు.

'ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రభుత్వాలు'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: సీపీఎం ఎల్లవేళలా పేదల పక్షాన పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు ఆరోపించారు. ఈ మేరకు శనివారం వికారాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కేంద్రం పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతుందని విమర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మహిపాల్, బుగ్గప్ప, రామకృష్ణ, సుభాష్, సతీష్, సుదర్శన్, రవి, మల్కయ్య, సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం



నూతన సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

దోమ: మత్స్యసహకార సంఘం నూతన కమిటీని ఆ సంఘం జిల్లా ఎన్నికల అధికారి నాగశివకుమారి సొసైటీ మల్లేపల్లి గ్రామ సభ్యుల సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోగు నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా బోయిని అంజిలయ్య, ప్రధానకార్యదర్శిగా మల్లయ్య, సభ్యులు గోవర్ధన్, గుణవర్ధన్, వెంకటయ్య, పెంటప్ప, నర్సప్పలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. అనంతరం నూతన సభ్యులను పూలమాలతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా రాములోరి కల్యాణం



కొనసాగుతున్న సీతారాముల కల్యాణం

కుల్కచర్ల: పుట్టపహాడ్ గ్రామంలో సీతారాముల కల్యాణం శనివారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉత్సవాన్ని వైభవంగా జరిపారు.

విఠల్ నాయక్‌కు పరామర్శ

యాలాల: తాండూరు ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల విఠల్ నాయక్ తండ్రి వాల్యా నాయక్ మృతి చెందగా.. శనివారం బాణాపూర్ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించారు. ఆయన వెంట సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, సర్పంచ్ బాలిబాయి రవికుమార్, రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

రుణ పరిమితి పెంచారు..

- నాలుగేళ్లుగా వడ్డీ మరిచారు
- పెదవి విరుస్తున్న డ్వాక్రా సంఘాలు
- ఇంట్రెస్ట్ కట్టాలంటూ బ్యాంకర్ల ఒత్తిడి



మహిళా సమాఖ్య సమావేశం

మోమిన్‌పేట: డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందని, మిత్తిలేని రుణాలను అందించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పి నాలుగు సంవత్సరాలైనా ఇప్పటికీ అతీగతి లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. తీసుకున్న రుణం మీద ఏటా వడ్డీలు చెల్లించాల్సి వస్తుందని, ప్రభుత్వం చెల్లించిన తరువాత మీమీ ఖాతాలో జమచేస్తామని, అసలుతో పాటు వడ్డీ చెల్లించాలంటూ బ్యాంకర్లు తమపై ఒత్తిడి తెస్తున్నారంటూ మహిళలు చెబుతున్నారు. తిరిగి రుణం ఇవ్వరేమోనని, తప్పని సరి పరిస్థితిలో ఇంట్రస్ట్ కట్టాల్సి వస్తుందని వారు తెలిపారు. ప్రభుత్వం చెల్లిస్తామన్న వడ్డీలు సకాలంలో పే చేస్తే.. తమకు న్యాయం జరుగుతుందని మహిళలు పేర్కొంటున్నారు. రుణ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.20లక్షల వరకు పెంచారు. కానీ.. నాలుగేళ్లుగా వడ్డీ మాత్రం చెల్లించడం లేదని మండిపడ్డారు. జిల్లాలోని 19మండలాల్లో 2019–20 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం అందించాల్సిన వడ్డీలు రూ.92కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం.

మోమిన్‌పేట మండలంలో..

మండల పరిధిలోని 838డ్వాక్రా సంఘాలకు నాలుగేళ్లుగా ప్రభుత్వం అందించాల్సిన వడ్డీ బకాయి రూ.9కోట్ల వరకు పేరుకుపోవడంతో మహిళలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం.. బ్యాంకు రుణాలు, స్త్రీనిధి నుంచి తీసుకొన్న రుణాలపై వడ్డీలు మహిళలే చెల్లిస్తున్నారు.

రావాల్సిన మిత్తి

2019–20 వడ్డీలేని రుణాలు తీసుకున్న సంఘాలు 749. వారికి రావాల్సిన వడ్డీ రూ.2.05కోట్లు, 2020–21లో 796 సంఘాలకు రావాల్సిన వడ్డీ రూ.1.76కోట్లు, 2021–22లో 747సంఘాలకు రావాల్సిన వడ్డీ రూ.2.07కోట్లు, 2022–23లో ఇప్పటి వరకు 810సంఘాలకు రూ.3.06కోట్లు ఇంట్రస్ట్ ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది.

తీసుకున్న రుణం

బ్యాంకుల నుంచి మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు 2019–20లో 477 సంఘాలకు గాను రూ.13.67కోట్లు, 2020–21లో 735సంఘాలు రూ.20.15కోట్లు, 2021–22లో 706సంఘాలు రూ.38.34కోట్లు, 2022–23లో ఇప్పటి వరకు 371 సంఘాలకు రూ.24.72కోట్లు రుణాలు తీసుకున్నారు. ఇలా రుణ పరిమితి పెంచి రుణాలు అందిస్తున్న ప్రభుత్వం.. వడ్డీ కూడా ఎప్పటికప్పుడు ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు.

ఖాతాలో జమవుతాయి



ప్రభుత్వం అందజేసే మిత్తి.. డ్వాక్రా సంఘాల రుణ ఖాతాలో జమచేస్తారు. నేరుగా బ్యాంకులకు ప్రభుత్వం అందజేస్తుంది. పూర్తిగా ఆన్‌లైన్ చేయడం ద్వారా ఎప్పటికప్పుడు సంఘాల పనితీరు, రుణాలను తిరిగి చెల్లించడం తెలిసిపోతుంది. నాలుగేళ్లుగా బకాయి ఉంది.

– రాజు, ఏపీఎం, మోమిన్‌పేట

విద్యార్థుల జీవితంలో 'పది' కీలకం

ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: విద్యార్థుల జీవితంలో పదో తరగతి అనేది పునాది వంటిదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శనివారం ముజాహిద్‌పూర్, బండవెల్కిచర్ల, సాల్విడు, ఇప్పాయిపల్లి, కుస్మసముద్రం, కుల్కచర్ల గ్రామాలల్లోని జెడ్పీపాఠశాలలో బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందజేసి మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ ఉన్నతికి మనఊరు–మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల అభ్యున్నతికి కృషిచేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల అవసరాల నిమిత్తం పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పదో తరగతి విద్యార్థులందరికీ ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, సర్పంచులు లక్ష్మీ ఆనంద్, శిరీష, బాలయ్య, రోజా, అనురాధ, సౌమ్యారెడ్డి, ఎంఈఓ అబీబ్ అహ్మద్, నాయకులు కనకం మొగులయ్య, బొయిని మొగులయ్య, కొండయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



ముజాహిద్‌పూర్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

నిధులు మంజూరైనా జాప్యమెందుకు?

వెంటనే బీటీరోడ్డు నిర్మించండి: గ్రామస్తులు



రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పరిగి: 'నిధులు మంజూరైనా రోడ్డు నిర్మాణంలో జాప్యమెందుకు? రోడ్డుమార్గం సరిగా లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామానికి బీటీ రోడ్డు వేయాలి' అంటూ శనివారం సయ్యద్‌పల్లి వాసులు పరిగి షాద్‌నగర్ ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కంకర తేలిన రోడ్డుతో అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి సంవత్సరాలు గడుస్తున్నా నేటి వరకు అమలు కాలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చేవరకు నిరసన విరమించేది లేదని భీష్మించారు. ఫోన్లో ఎమ్మెల్యే హామీ ఇచ్చినా.. నిరసన విరమించలేదు. నిరసన నేపథ్యంలో రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి నిరసన విరమింపజేసి, ట్రాఫిక్ క్లీయర్ చేశారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

కేంద్ర బృందం సభ్యులు



వైద్య సిబ్బందికి సూచనలను ఇస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

పరిగి: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కేంద్ర బృందం వైద్యులకు సూచించింది. మండల పరిధిలోని చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెండో రోజైన శనివారం సందర్శించిన బృందం.. ఆరోగ్య కేంద్రంలో ఉన్న పరికరాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంది. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులతో కేంద్ర బృందం సభ్యులు మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందికి వైద్య సేవలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ ఆస్పత్రికి నిరుపేద ప్రజలే వస్తుంటారని, కావున వారికి వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో వాతావరణ పరిస్థితులు, వైద్యసేవలు చాలా బాగున్నాయని, ఇంకా సేవలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. చిట్యాల ఆరోగ్య కేంద్రాన్ని కాయకల్ప పథకం కింద ఎంపిక చేసేందుకు ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రాజ్‌కుమార్, కవిత, అనురాగ్, వైద్యాధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..

దోమ: గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నానని సర్పంచి కల్పన అన్నారు. శనివారం మండల పరిధిలోని గంజిపల్లిలో సీసీరోడ్డు పనులు ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యాడ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రతి వార్డులో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ పనులు చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



సమీక్షలో మాట్లాడుతున్న సర్పంచి రాజిరెడ్డి

దోమ: గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచి రాజిరెడ్డి అన్నారు. శనివారం జీపీ ఆవరణలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలసి వార్డు సభ్యులతో నిర్వహించిన సాధారణ సమావేశంలో సర్పంచి మాట్లాడారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తున్నామని, అండర్ డ్రైనేజీ, సీసీరోడ్లు, ప్రజలకు తాగు నీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొన్ని వార్డుల్లో మిగిలిన పనులు ఉన్నాయని, వార్డు సభ్యులు ముందుకు వస్తే అప్పగించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. దీంతో ఆ పనులు చేపట్టేందుకు సభ్యులు ముందుకు వచ్చారు. పనులకు సంబంధించిన తీర్మానం చేయించి వార్డు సభ్యులకు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచి వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గోపాల్‌గౌడ్, వార్డు సభ్యులు రమేశ్, లక్ష్మణ్, వసంతరావు, నిరోష, అంజిలమ్మ, ఆంజనేయులు, కోఆప్షన్ సభ్యులు నరేందర్ రెడ్డి, గౌస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్గానికి మద్దతా?

బీజేపీ కౌన్సిలర్లపై కొండా సీరియస్

తాండూరు: మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమల్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు బీజేపీ కౌన్సిలర్లు సంతకాలు చేయడం పట్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం స్థానిక నేతలతో ఫోన్‌లో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేల ఎర కేసుతో బీజేపీకి నష్టం కలిగించేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గానికి.. ఎలా మద్దతు పలుకుతారంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విషయమై జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత కారణాల వల్ల తాను అందుబాటులో లేకపోవడం వల్లే కౌన్సిలర్లతో సంతకాలు తీసుకున్నారని, అవిశ్వాస తీర్మానానికి మాత్రమే సంతకాలు చేశారని, అయితే అవిశ్వాస తీర్మానంలో బీజేపీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు పలకరని ఆయన చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ కల్లోలం..

మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బీఆర్ఎస్ పార్టీతో జతకట్టడం పట్ల ఆ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి పట్టణ అధ్యక్షుడిగా ఉన్న ప్రభాకర్‌గౌడ్ అధికార పార్టీతో చేతులు కలిపిన విషయం పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, ప్రభాకర్‌గౌడ్‌పై చర్యలు తీసుకుంటామని రమేష్ మహరాజ్ తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీలు ఆపాలి



నిరసన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ నేతలు

అనంతగిరి: ఉపాధ్యాయుల బదిలీలకు జీరో సర్వీసును అనుమతించాలని, దొడ్డి దారిన జరుగుతున్న బదిలీలను వెంటనే ఆపాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పదోన్నతులు, బదిలీలలో పారదర్శకత పాటించాలన్నారు. కోర్టు కేసులు లేని స్కూల్ అసిస్టెంట్ తెలుగు, హిందీ పోస్టులను అర్హత గల ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. 317 జీఓతో దూర ప్రాంతంలో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయుల బదిలీలలకు అనుమతిస్తే.. వారికి కొంత ఉపశమనం కలుగుతుందని, ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాములు, రత్నం, వెంకటప్ప, సలీం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అనుసంధానం పూర్తి చేయాలి

రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి



బీఎల్ఓల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న ఆర్ఐ

పెద్దేముల్: ఓటర్ ఆధార్ లింక్ త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దేముల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నాగులపల్లి, గోపాల్‌పూర్, సిద్దన్నమడుగుతండాతో పాటు పలు గ్రామాలల్లో పర్యటించి ఓటర్ ఆధార్ కార్డు వివరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ ఆధార్ లింక్‌పై సీరియస్‌గా ఉన్నారని, రెండు రోజుల్లో పూర్తి చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఇప్పటి వరకు మండలంలో కేవలం 80శాతం మాత్రమే ప్రక్రియ పూర్తి అయిందని, మరో 20శాతాన్ని రెండు రోజుల్లో పూర్తి చేసి, సమాచారాన్ని తహసీల్దార్ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

ఎంపీపీ విజయలక్ష్మి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

చేవెళ్ల: మండలంలోని అన్ని గ్రామాలను ఎమ్మెల్యే కాలె యాదయ్య సహకారంతో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ఊరేళ్ల గ్రామంలో ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం స్థానిక వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, సర్పంచ్ జహంగీర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఊరేళ్ల గ్రామంలోని ప్రధాన రోడ్డుగా ఉన్న అంబేద్కర్ చౌరస్తా నుంచి హనుమాన్ దేవాలయం వరకు ఈ సీసీ రోడ్డు వేస్తున్నట్లు చెప్పారు. ఈ రోడ్డుతో గ్రామంలో ప్రధాన సమస్య తీరుతుందన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలు, అభివృద్ధి చేయడంతో పాటు గ్రామానికి ఒక సశ్మాన వాటికి డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతివనం, తదితర వాటిని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివప్రసాద్, సర్పంచ్ జహంగీర్, ఉప సర్పంచ్ విఠలయ్య, గ్రామస్తులు, నాయకులు ఉన్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా స్వామివారికి సప్తవాహన సేవలు చేశారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రథసప్తమి వేడుకల్లో భాగంగా స్వామివారిని సప్త వాహన సేవలైన సూర్యప్రభవాహనం, హంసవాహనసేవ, సింహ్మవాహనసేవ, శేషవాహనసేవ, గరుడవాహన సేవలపై స్వామివారిని ఊరేగించారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయండి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య చెప్పారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ 'ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం మున్సిపల్ పరిధిలోని మణి గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ చేవెళ్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే బరిలో ఎవరిని నిలిపిన వారి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలని చెప్పారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి విస్తృతంగా కృషి చేయాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి యువతి యువతీలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. అలాగే, రైతుబంధు, రైతు బీమా పథకాలను అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మంత్రి కేటీఆర్ చొరవతో రాష్ట్రానికి ఎన్నో పరిశ్రమలు రావడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ , జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు పొడువు శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత అరిగోస

- విద్యుత్ కోతలతో అవస్థలు
- 12గంటల పాటు త్రీఫేజ్ రాక ఇక్కట్లు
- ఎల్ఆర్, ఎల్‌సీ పేరుతో గంటల కొద్దీ కోతలు



ఇటీవల వేసిన వరి

దౌల్తాబాద్: పుడమి తల్లిని నమ్ముకుని సాగు చేస్తున్న అన్నదాతలు కరెంట్ కోతలతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. 12గంటల పాటే సరఫరా అవుతుండగా.. అదీ త్రీఫేజ్ విద్యుత్ సక్రమంగా అందించక పోవడంతో పొలాలకు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడిందని, మండలంలో వారం పదిరోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా సాగు పనులు..

మండలంలో యాసంగి (రబీ) వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పొలాల్లో దమ్ము చేయడం, నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. చెరువులు జలాశయాలే కాకుండా భూగర్భజలాలు మెరుగైన స్థితిలో ఉండడంతో విద్యుత్ బోర్ల ఆధారంగా ఎక్కువగా పంటలు సాగవుతున్నాయి. వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఈ సమయంలో నీటి తడులు అధికంగా అవసరమవుతాయి. కానీ విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ వినియోగం పెరగడంతో ట్రాన్స్‌కో అధికారులు దశలవారీగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

రాత్రివేళ కరెంట్

విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యాన కోత విధిస్తున్నట్లు అధికారికంగా అధికారులు చెబుతున్నారు. కానీ ఇచ్చే 12గంటల విద్యుత్ త్రీఫేస్ రాకపోవడంతో బోర్లు నడవడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా సరఫరా కూడా రాత్రి వేళ ఇస్తుండడంతో కాపలా కాయాల్సి వస్తోందని, ఆ సమయంలోనూ తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండడంతో పొలానికి నీరు పారడం లేదంటున్నారు. పంటలు చేతికందే దశలో ఉన్నాయని, ట్రాన్స్‌కో అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా కోతలు

ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా జరుగుతుందని చెబుతున్నా.. స్థానిక సిబ్బంది ఎల్‌సీ(లోకల్ కటింగ్) ఎల్ఆర్(లైన్ రిపేర్) పేరుతో గంటల కొద్దీ కోత విధిస్తున్నారు. ఒక్కోసారి త్రీఫేజ్ విద్యుత్ ఏ సమయంలో ఉంటుందో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు. పంటలు నష్టపోకుండా అధికారులు స్పందించాలని రైతులు విన్నవిస్తున్నారు.

నాణ్యమైన సరఫరా అందించాలి



విద్యుత్ కోతలతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. అప్పులు చేసి సాగు చేస్తున్న పంటలకు సాగు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడింది. సాగు చేస్తున్న భూమిలో సగం కూడా తడవటం లేదు. దీనికి తోడు రాత్రి కరెంట్ ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి.

– నారాయణ, రైతు, సలీంపూర్